
సాక్షి గుంటూరు

శనివారం । 11 । అక్టోబర్ । 2025



మానసిక ఆరోగ్యం కీలకం

నకరికల్లు: అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలను కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతివర్ధన్ మాట్లాడారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 79,040 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 74,040 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఇర్లపాడులో డీఎల్‌పీవో పర్యటన

నాదెండ్ల: ఇర్లపాడు గ్రామంలో శుక్రవారం నరసరావుపేట డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణ రావు పర్యటించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ తీరుపై ఆరా తీశారు.

కూటమి కుట్రలపై కోటి సంతకాల పోరు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ గళం

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రజల్లోకి పార్టీ నేతలు వెళ్లి కూటమి సర్కార్ కుట్రలను వివరించనున్నారు. పేదోడికి వైద్య సేవలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్యవిద్యను కూటమి పాలకులు ఎలా దూరం చేస్తున్నారో అవగాహన కల్పించి మద్దతు కోరనున్నారు. అడ్డగోలుగా తమ వారికి వైద్య కళాశాలలను ధారాదత్తం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు ప్రజలతో కలిసి పోరుబాట పట్టనున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో కార్యక్రమ పోస్టర్లను స్థానిక సమన్వయకర్తలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి పాలకుల నిర్వాకాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. విద్య, వైద్య రంగాలను కూటమి సర్కారు నాశనం చేసి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజలు మద్దతు తెలిపి సర్కారు మెడలు వంచేందుకు తమవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

\- సాక్షి, నెట్‌వర్క్



ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం నంబూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టరును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ శ్రేణులు - పెదకాకాని



వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టరును స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. - తెనాలి



గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పోస్టర్లను ఆవిష్కరించారు. - గుంటూరు రూరల్



వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టరును తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. - పట్నంబజారు



కోటి సంతకాల సేకరణ పోస్టరును వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఆవిష్కరిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నేతలు - మంగళగిరి టౌన్



కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టరును గుంటూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, పార్టీ నాయకులు - తాడికొండ

ఎన్టీఆర్ వైద్యసేవ బంద్

- బకాయిలు చెల్లించేవరకు నిలిపివేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రుల వెల్లడి
- కూటమి సర్కారు తీరుతో వైద్యరంగం అస్తవ్యస్తం
- వైద్యసేవల కోసం పేదల అగచాట్లు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా పేదలకు ఉచిత వైద్య సేవలు నిలిచిపోయాయి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా వైద్య సేవలు అందించిన నెట్‌వర్క్ ఆసుపత్రులకు కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. దీంతో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేశారు. బంద్ పాటించారు. జిల్లా వ్యాప్తంగా 154 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వీటిల్లో 33 ప్రభుత్వ, 121 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. అసోసియేషన్ పిలుపు మేరకు గుంటూరు కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని పలు ఆసుపత్రులు బంద్ పాటిస్తున్నట్లు ఫ్లెక్సీలు ప్రదర్శించాయి. రోగులు, అంబులెన్సులతో నిత్యం కిటకిటలాడే ఈ రోడ్డు శుక్రవారం మామూలు రద్దీతో కనిపించింది. రోజూ పథకం ద్వారా చికిత్స అందించేందుకు నెట్‌వర్క్ ఆసుపత్రులు అనుమతి కోసం ట్రస్టు కార్యాలయానికి నివేదికలు పంపిస్తుంటాయి. బంద్ ప్రభావంతో శుక్రవారం ఈ అనుమతులు చాలా తక్కువ సంఖ్యలో కోరినట్లు సమాచారం.

కీలక డిమాండ్లు తీరిస్తేనే...


నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 2,700 కోట్ల బకాయిలు ఉన్నట్లు సంఘం నేతలు వెల్లడించారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి హెల్త్ ప్యాకేజీల్లో పెరుగుదల నామమాత్రంగా ఉందని పేర్కొన్నారు. 2010 నాటి పరిస్థితితో పోలిస్తే నెట్‌వర్క్ ఆసుపత్రులపై భారం పడుతున్నట్లు వాపోయారు. ఆసుపత్రుల ఖర్చులు పెరిగిపోయినా ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల సమ్మెకు పిలుపునిచ్చినట్లు నేతలు వెల్లడించారు. డిమాండ్‌లను పరిష్కరించే వరకు సేవలు నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.



ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ నిలిపివేతతో నిరుత్సాహంలో రోగులు

పేదల ప్రాణాలకు భరోసా కరువు

కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠినాత్మక నిర్ణయం వల్ల పథకం ద్వారా లభించే ఉచిత వైద్య సేవలు పేదలకు శుక్రవారం నుంచి నిలిచిపోయాయి. తద్వారా వివిధ రోగాలకు చికిత్స చేయించుకునే వారు డబ్బులు పెట్టాల్సి వచ్చింది. కొంతమంది స్థోమత లేక అల్లాడిపోతున్నారు. పేదోళ్ల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా మందులు ఉండటం లేదు. సరిగ్గా వైద్య సేవలు అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ ఆసుపత్రుల వైద్య సేవల నిలిపివేత ప్రభావం పేదలపై ఎక్కువగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇకనైనా పట్టువీడాలని రోగులు కోరుతున్నారు.



ఓల్డ్ క్లబ్ రోడ్డులోని ఓ ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీ

రాజన్న ప్రవేశపెట్టిన పథకం

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదోళ్లకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించాలనే మహోన్నత లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. డాక్టర్‌గా పేదోల గుండె బాధ తెలిసిన వ్యక్తిగా ఆయన తెచ్చిన ఈ పథకం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారింది. మొట్టమొదటి సారిగా ఏపీలో ప్రవేశపెట్టినా అనంతరం దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. తద్వారా డాక్టర్ రాజశేఖర రెడ్డి పేదోల గుండెల్లో దేవుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారు. అనంతరం ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఆరోగ్యశ్రీ పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు పెంచడమే కాకుండా చికిత్స అనంతరం ఆసరా పేరుతో ఆర్థిక భరోసా అందించారు. దేశ వ్యాప్తంగా మొట్టమొదటి సారిగా ఆరోగ్యశ్రీ రోగులకు భరోసా కల్పించి, రికార్డు సృష్టించారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చే కుట్రలో భాగంగా బకాయిలు నిలుపుదల చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పథకం పేరు మార్చి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా పిలుస్తున్నా నేటికీ ఆరోగ్యశ్రీ అనగానే డాక్టర్ రాజశేఖరరెడ్డి పేరే అందరికీ గుర్తుకు వస్తుంది. దీంతో కూటమి నేతలు ఈ పథకాన్ని బీమా పేరుతో థర్డ్‌పార్టీకి అప్పగించే ప్రక్రియ ప్రారంభించింది. బకాయిలు చెల్లించకుండా, యూనియన్ నేతలను సంప్రదించకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశాయి.

పసివాళ్లంటే ఎంత అలుసో..!

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యంతో ఆసుపత్రి పాలైన హాస్టల్ విద్యార్థులు

కూటమి ప్రభుత్వ అలసత్వం... బీసీ సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యం.. ఉన్నతాధికారుల ఉదాసీనత వెరసి వసతి గృహ విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యేలా చేసింది. 54 మంది అస్వస్థతకు గురవడంతో కలకలం రేగింది. ఘటనకు కారణం కలుషిత ఆహారమేనని అధికారులు భావిస్తున్నారు. పేద పిల్లల ప్రాణాలంటే కూటమి సర్కారుకు ఎంత అలుసో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం.

- అస్వస్థతకు గురైన 54 మంది అన్నవర్రు బీసీ హాస్టల్ విద్యార్థులు
- బాధితులను ఆస్పత్రికి తరలించిన కుక్, ఉపాధ్యాయులు
- కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు
- హాస్టల్‌లో ఆహారం, తాగునీటి నమూనాలు సేకరించిన అధికారులు

ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ హాస్టల్‌లో నాలుగు నుంచి పది తరగతుల వరకు మొత్తం 107 మంది విద్యార్థులున్నారు. వీరికి గురువారం రాత్రి బెండకాయ వేపుడు, రసం, మజ్జిగతో భోజనం పెట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఒకరి తరువాత ఒకరు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. గమనించిన నైట్ వాచ్‌మన్ విషయాన్ని ఉదయం విధులకు వచ్చిన కుక్ కల్పనకు చెప్పారు. అప్పటికే 17 మంది అస్వస్థతకు గురై బాధపడుతుండటంతో కల్పన వారిని ఆటోలో పెదనందిపాడు పీహెచ్‌సీకి తరలించారు. ఉదయం కిచిడీ, టమాట చట్నీతో టిఫిన్ చేసిన తరువాత అదేవిధంగా బాధపడుతున్న మరో 37 మంది విద్యార్థులను కూడా ఆస్పత్రికి తరలించారు. వారిలో 16 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు 108 వాహనాల్లో పంపించారు. సాయంత్రానికి 21 మందిని డిశ్చార్జ్ చేసి హాస్టల్‌కు తరలించగా, 17 మంది శిబిరంలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా పెదనందిపాడు పీహెచ్‌సీకి చేరుకుని బాధిత విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఆస్పత్రిలో సరిపోని బెడ్లు

ఒక్కసారే సుమారు యాభై మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రికి రావడంతో ఆస్పత్రిలో ఉన్న బెడ్లు సరిపోలేదు. దీంతో ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురు, నలుగురిని కూడా పడుకోబెట్టి చికిత్స అందించారు. మంచం చుట్టూ సెలైను స్టాండ్లు పెట్టడంతో చేతులు అటూ ఇటూ కదపలేక, కడుపునొప్పి తాళలేక విద్యార్థులు నరకయాతన అనుభవించారు. అనంతరం వారి ఇబ్బందులను గమనించిన కలెక్టర్.. కల్యాణమండపంలో స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేయించారు. సెలైన్ స్టాండ్లు కూడా సరిపడినన్ని లేకపోవడంతో విద్యార్థులే ఒక చేతితో సెలైన్ బాటిల్ పట్టుకుని కనిపించగా, మరికొందరికి ఆశా కార్యకర్తలు బాటిళ్లు పట్టుకోవాల్సి వచ్చింది.



కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



ఆస్పత్రి ఆవరణలో బల్లపై కూర్చోబెట్టి విద్యార్థికి సెలైన్ ఎక్కిస్తున్న దుస్థితి

తీవ్ర జ్వరంతో బాధపడుతూ..

అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో పదహారు మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జ్వరం కూడా ఉన్నట్లు వైద్యులు గమనించారు. విద్యార్థులు ఇంత పెద్ద సంఖ్యలో అస్వస్థతకు గురవ్వడానికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. దీంతో ఆయా శాఖల అధికారులు ఆహార పదార్థాల, తాగునీటి నమూనాలను సేకరించారు. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి కూడా బయటి నుంచి బిర్యానీ, కలియా, పెరుగు చట్నీలు వచ్చాయి. వాటిని విద్యార్థులకు అందించారు. మరుసటి రోజు నుంచి కడుపునొప్పితో బాధపడినట్లు కొందరు విద్యార్థులు చెప్పారు.


మంత్రి దుర్గేష్ ఆరా

గుంటూరు మెడికల్: హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. వారు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమని పేర్కొన్నారు.



ఆస్పత్రి బెడ్‌పైనే కూర్చుని చికిత్స చేయించుకుంటున్న విద్యార్థులు

తాండవిస్తున్న అపరిశుభ్రత



వసతి గృహంలో అపరిశుభ్ర వాతావరణం కనిపించింది. అధ్వానంగా మరుగుదొడ్లు ఉండగా, వాటర్ ట్యాంక్ అయితే అత్యంత దారుణంగా ఉంది. మురుగు, నురగలు తేలుతూ మట్టితో ట్యాంకులోని నీరు దర్శనమిచ్చింది. ఈ నీటినే తామంతా వినియోగించుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు.

వార్డెన్ నిర్లక్ష్యం..

గురువారం రాత్రి విద్యార్థులు భోజనం చేసే సమయంలోగానీ, ఉదయం విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పుడుగానీ, వారిని ఆస్పత్రికి తరలించే సమయంలోగానీ వార్డెన్ అందుబాటులో లేకపోవడం ఆయన విధుల పట్ల వహిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కుక్‌కు సమీప బంధువు అయిన అశోక్ గత కొద్ది నెలలుగా హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి జీతం కూడా వార్డెన్ తన జేబు నుంచే చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. అశోక్ గురువారం రాత్రి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. నీరు మాత్రమే తాగాడని సిబ్బంది చెబుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు మిస్ ఇండియా అమూల్య ప్రియదర్శినికి సన్మానం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణానికి చెందిన అమూల్య ప్రియదర్శిని మిస్ ఇండియాగా మూడోస్థానం కైవసం చేసుకుని తొలిసారి శనివారం సత్తెనపల్లి రానున్నారు. ఇటీవల గోవాలో జరిగిన అందాల పోటీల్లో ఆమె తెలంగాణ నుంచి పాల్గొని మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం నుంచి ఆమె పాల్గొన్నారు. గతంలో మిస్ హైదరాబాద్ కైవసం చేసుకున్నారు. ఆమె తాతయ్య చిలుకా రమేష్ సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారిగా గతంలో పని చేశారు. ఆమె రాకను పురస్కరించుకుని పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని హోటల్ కార్తికేయ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు సన్మానం చేయనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాది చలువాది చినసత్యనారాయణ, మిత్ర బృందం తెలిపింది.

జిల్లాకు 1970 మెట్రిక్ టన్నుల యూరియా



నాదెండ్ల: సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను శుక్రవారం పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. జిల్లాకు ఎస్‌ఎఫ్‌ఎల్ యూరియా 1970 మెట్రిక్ టన్నులు వచ్చినట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత మేర యూరియా అందుబాటులో ఉందన్నారు. రేక్ పాయింట్ నుంచి సొసైటీలు, డీలర్లకు దామాషా ప్రకారం యూరియా పంపిణీ చేయాలని ఏవోలను ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ కేవీ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



తాడేపల్లి రూరల్ : కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని ఐద్వా కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర 16వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. శ్రీనివాసకుమారి, కె.శ్రీదేవి, అమలాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కోళ్లూరు ప్రసన్నాంజనేయుని దీక్షలు



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి మాల ధారణ కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా నరసింహాచార్యులు, అనంతాచార్యులు తెలిపారు. కార్తిక మాసంతో పాటు హనుమత్ వ్రత కార్యక్రమం సందర్భంగా మండల కాల దీక్షలు 23 వరకు ఉంటాయన్నారు. అర్ధ మండల కాల దీక్షలకు నవంబర్ 9 నుంచి 11 వరకు మాలధారణ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3న ప్రసన్నాంజనేయుని హనుమత్ వ్రత మహోత్సవ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

ఈ-వేస్ట్ సేకరణ



సత్తెనపల్లి: ఈ-వెస్ట్ (ఎల్రక్టానిక్) ను మున్సిపల్ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందకుమార్ శుక్రవారం తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గృహాల్లో పాడైన బ్యాటరీలు, టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, రైస్ కుక్కర్లు, మొబైల్ ఫోన్లు, మిక్సీలు, బల్బులు, ఎలక్ట్రానిక్ షాపుల్లో పాడైన కంప్యూటర్లు, ప్రింటర్లు, కీబోర్డులు, తదితర ఈ-వేస్ట్‌ను పురపాలక సంఘంలోని ప్రత్యేక కౌంటర్ నందు సేకరించడం జరుగుతోందన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	42,595
అమ్మకాలు	41,281
నిల్వ	11,715

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000-15,000
నంబరు-5	10,000-14,000
273	10,500-12,500
341	10,000-15,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,500-15,200
నంబరు-5	10,000-14,200
341	10,000-15,500
4884	10,000-14,500
సూపర్-10	11,000-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,500 - 15,500
దేవనూరు డీలక్స్	10,000 - 14,500
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000-15,200
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,500
తాలు	5,300 - 7,700

-కొరిటిపాడు (గుంటూరు)

కంపోస్ట్ యార్డుతో కష్టాలు

- పేరుకుపోతున్న వ్యర్థాల గుట్టలు
- పనిచేయని మూడు కాంపాక్టర్లు
- దెబ్బతింటున్న సాగు భూములు
- స్థానికులకు తప్పని తీవ్ర ఇబ్బందులు

తెనాలి కంపోస్ట్ యార్డు వ్యర్థాల గుట్టలతో నిండిపోతోంది. రోజూ తెనాలిలో ఉత్పత్తి అయిన వ్యర్థాలను జిందాల్ సంస్థకు తరలించాలని ఆదేశాలున్నా అమలు కావడం లేదు. భూగర్భ జలాలు కలుషితమై పంట పొలాలు దెబ్బ తింటున్నాయి. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తెనాలి అర్బన్: కంపోస్ట్ యార్డులోని వ్యర్థాల గుట్టల కారణంగా సమీపంలోని పంట పొలాలకు సమస్యలు తలెత్తుతున్నాయి. యార్డు ప్రహరీలు పడిపోతున్నాయి. చెత్త నుంచి మిథైల్ గ్యాస్ విడుదలవుతూ దానికదే తగులబడుతోంది. వ్యర్థాల దగ్ధంతో రోజుల తరబడి హానికరమైన పొగ చుట్టుపక్కల అర కిలోమీటరు వరకూ వ్యాపిస్తోంది. దీంతో ప్రజలకు కళ్లు మండుతున్నాయి. ఊపిరి పీల్చుకోవటానికి కూడా వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. యార్డు దారిలోనే పలు విద్యాసంస్థలు, పప్పు మిల్లులు ఉన్నాయి. అతిదగ్గర్లోనే అపార్టుమెంట్లు, బీసీ కాలనీ ప్రజలు ఉంటున్నారు. యార్డు కారణంగా స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. యార్డును తరలించాలని కోరుతున్నారు.

మూలకు చేరిన కాంపాక్టర్లు

తెనాలి పట్టణంలో చెత్త సేకరణ కోసం ఏడు కాంపాక్టర్లు వినియోగిస్తున్నారు. తెనాలిలో రోజూ ఉత్పత్తి అయ్యే 90 టన్నుల చెత్తలో 80 టన్నులను కాంపాక్టర్‌లలో గుంటూరు సమీపంలోని జిందాల్ సంస్థకు కొద్దినెలలుగా నిత్యం తరలిస్తున్నారు. మిగిలిన 10 టన్నులను ఇక్కడే యార్డులో పడేస్తున్నారు. నెల క్రితం ఒకటి పెద్దది, రెండు చిన్న కాంపాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. యార్డుకు వెళ్లే దారి కూడా వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. వాహనాలు పాడవడం వలన పట్టణంలో పూర్తి స్థాయిలో చెత్త సేకరణ జరగటం లేదని సమాచారం.



యార్డులో వ్యర్థాల గుట్టలు

మొత్తం 1.07 లక్షల టన్నుల వ్యర్థాలు

యార్డులోని వ్యర్థాల పరిమాణం 1.07 లక్షల టన్నులు ఉండవచ్చని అధికారుల అంచనా. మున్సిపల్ అధికారులు 63,550 టన్నుల చెత్త తరలింపు కోసం టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన సుధాకర ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంసస్థే టెండర్లు దక్కించుకుని ఫ్రిబవరిలో పని ప్రారంభించింది. మే నెలలో టెండర్లు రివైజ్ చేసి, 72 వేల టన్నుల చెత్తను తరలించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. జూన్‌లో మరోసారి మిగిలిన 35 వేల టన్నుల చెత్త తరలింపునకు టెండర్లు పిలిచారు. అదే సంస్థ టెండర్లు దక్కించుకుని, గత నెల చివరిలో పనులు ప్రారంభించింది.

వారంలో మరమ్మతులు



కాంపాక్టర్లు మరమ్మతులకు గురైన విషయం నా దృష్టికి వచ్చింది. వారంలో వాటిని బాగు చేయించాలని ఆదేశించాను. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 40 టన్నుల నూతన కాంపాక్టర్‌ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అది రాగానే తెనాలిలో ఉత్పత్తి అయిన చెత్త నేరుగా జిందాల్ సంస్థకు తరలిస్తాం.

– జాగారపు రామ అప్పల నాయుడు, కమిషనర్, తెనాలి

తపాలా ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహదేవయ్యను విధుల నుంచి తొలగించిందని, వెంటనే ఆయన్ను ఉద్యోగంలోకి తీసుకోవాలి ఏఐజీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎస్.వి. రాఘవేంద్రలు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పోస్టాఫీసు వద్ద గురువారం ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను అమలు చేయని కోరారు. గతంలో నిరవధిక సమ్మెకు నాయకత్వం వహించినందున మహదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించిన తగదన్నారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేయసిని మర్చిపోలేక వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: తనకు వివాహమైనప్పటికీ ప్రేయసిని మర్చిపోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసరిపాలెం కాలనీకి చెందిన చిలకా చంటి (24) స్థానికంగా ఒక యువతిని ప్రేమించాడు. పలు కారణాలతో స్థానికంగా ఉండే బంధువుల కుటుంబంలోని యువతిని ఈ ఏడాది ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా ప్రేయసిని మర్చిపోలేకపోతున్నానని, ఆమె గుర్తుకొస్తోందని భార్యతో చెప్పాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి పక్కన రేకుల షెడ్డులోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వచ్చి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 259

కొమ్ములు : 175 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,460	10,560	10,560

కాయలు : 84 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,560	10,560

మొత్తం అమ్మకాలు : 194.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అండర్-19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. చింపారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా సత్తా చాటాలని సూచించారు. విజయం కోసం పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. వేటపాలెం బీబీహెచ్ కాలేజీ పీడీ బాపయ్య శెట్టి, పీడీ సుబ్బారెడ్డి, రిటైర్డ్ పీడీ డీసీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి చెందిన వారమనే నీరివ్వడం లేదు!

- తుళ్ళూరు మండలం వడ్డమాను ఎస్సీ కాలనీలో 10 రోజులుగా నరకయాతన
- ఉన్నతాధికారులైనా పట్టించుకుని నీరు సరఫరా చేయించాలని స్థానికుల వినతి


వడ్డమాను(తాడికొండ): వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటామనే నెపంతో గత 10 రోజులుగా తమ బజారుకు నీరు ఇవ్వకుండా అధికారులు స్థానిక నాయకులతో కుమ్మక్కై వేధిస్తున్నారని తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామ ఎస్సీ కాలనీ వాసులు ఆరోపించారు. గ్రామంలో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. వాటిలో తమ బజారుకు వచ్చే మోటారు మాత్రమే మరమ్మతులకు గురైందనే నెపంతో నీరివ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గోడు చెప్పుకుందామని కార్యదర్శితోపాటు ఎవరిని ఆశ్రయించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పైగా హేళనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ నిజంగా సమస్యే ఉంటే మరమ్మతులకు 10 రోజులు ఎందుకు పడుతుందని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అయినా చేసి కనీసం ట్యాంకర్ల ద్వారా రెండు రోజులకు ఒకసారి సరఫరా చేయాలని కోరారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా మోటారు మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని చెప్పారు. గత 4 రోజులుగా తనకు ఇతర పనులు ఉండటం వలన సమయం కుదరలేదని తెలిపారు. పార్టీ, కుల వివక్ష వంటివి తాను చూపించలేదన్నారు. త్వరలో మోటారుకు మరమ్మతులు చేయించి నీటిని అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.



వడ్డమాను ఎస్సీ కాలనీలో సమస్యలను వివరిస్తున్న స్థానికులు

చల్ మోహన రంగా...

తెనాలి: పట్టణంలో శుక్రవారం రహదారిపై దౌడు తీస్తూ వస్తున్న గుర్రాన్నీ, బుర్రమీసాలు, తలపాగాతో దానిపై స్వారీ చేస్తున్న వ్యక్తిని చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి పేరు ఉయ్యూరు లక్ష్మారెడ్డి. చుండూరు మండల గ్రామం కార్మూరివారిపాలెం వాసి. ప్రఖ్యాత కవి సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.శివారెడ్డి స్వగ్రామం కూడా ఇదే. వేమూరు నియోజకవర్గంలోని ఆ గ్రామం ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిధిలో ఉంది. 61 ఏళ్ల లక్ష్మారెడ్డికి వ్యవసాయమే జీవనాధారం. 61 సెంట్ల పొలం ఉంది. అబ్బాయి, అమ్మాయి. కానీ బాధ్యతల బరువు లేదు. సంసార సాగరాన్ని అవలీలగా ఈదేసిన వ్యక్తికి, గుర్రం స్వారీ ఓ లెక్కా అన్నట్టుంది ఆయన తీరు. క్లాం లాగుతూ రెండో చేతితో చెర్నాకోలను పట్టుకుని ఒక లయతో అతడి స్వారీలో కనిపించింది. 15 ఏళ్లప్పుడు గుర్రం కొనాలని అనుకున్నా.. 30 ఏళ్లు వచ్చాక కొన్నారు. గుర్రాలు మారినా తన స్వారీ మాత్రం ఆగలేదు. అవసరమైతే మహారాష్ట్ర వెళ్లి గుర్రం తెస్తుంటానని చెప్పారు. రోజూ గుర్రానికి ఉలవలు, పచ్చి గడ్డి ఆహారంగా ఇస్తుంటారు. ఎక్కడికైనా ఇలానే వెళుతుంటానని చెప్పారు.



సంపూర్ణ ఆరోగ్యానికి ఈత దోహదం

జస్టిస్ ఎన్. హరినాథ్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈతతో మెరుగైన శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం శ్యామలానగర్‌లోని ఈత కొలనులో కానాల అంజనీ శ్రీకాంత్ రెడ్డి స్మారక 8వ మాస్టర్స్ అంతర్ జిల్లాల పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక క్రీడలో సాధన చేయాలన్నారు. యోగా కూడా ఎంతో మేలు చేస్తుందని వెల్లడించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది రమణ రావు మాట్లాడుతూ 20–90 ఏళ్ల వరకు వయస్సున్న వారికి ఈ పోటీలను ఏటా మాదిరిగానే నిర్వహించామన్నారు. 180 పాల్గొన్నారన్నారు. పోటీలను ఉదయం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

పెదకాకాని: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగి పరిశ్రమలను స్థాపించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టి విజయవంతం కావాలని పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం.నవీన్ కుమార్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు 'అమేయా -2కే25' ముగింపు వేడుకలకు శుక్రవారం ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం.నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమలకు తగ్గట్టు సన్నద్ధం అవటానికి విద్యార్థి దశ కీలకమన్నారు. మొబైల్ యాప్‌లను వినియోగించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా వాటి తయారీపై దృష్టిసారించాలని సూచించారు. సదస్సులో జిగ్ టెక్, పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్‌సీ కార్నేజ్, పిక్టో, క్రిక్ క్విజ్ వంటి సాంకేతిక పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, సంధానకర్త వి.కిరణ్ కుమార్, ఐఈఎం విద్యార్థి విభాగ సభ్యులు ఎస్.పవన్ సాయి, సీహెచ్ విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నవీన్ కుమార్ తదితరులు

జాతీయ పికిల్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): బెంగళూరులో శనివారం నుంచి జరగనున్న జాతీయ ఓపెన్ పికిల్ బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, విన్సెంట్ ఎంపికయ్యారని జిల్లా సంఘం చైర్మన్ టి.అరుణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీవీవీ హెల్త్ హబ్‌లో వారు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. క్రీడాకారులను తనతోపాటు జిల్లా సంఘం అధ్యక్షుడు టి.హరికిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.శివకుమార్, హ్యాట్రిక్ స్పోర్ట్స్ అధినేత శ్రీకాంత్, అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్‌లు అభినందించినట్లు పేర్కొన్నారు.



ఎంపికైన అరుణ్ కుమార్, ఆనంద్ కుమార్, విన్సెంట్

ప్రణాళికతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరంలో సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల మూల కారణాలు తెలుసుకొని పరిష్కరించేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ రూపొందించిన ఐ-ఆర్ఏడీ యాప్‌లో రవాణా, పోలీస్, రహదారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రమాదాల వివరాలను, తనిఖీ నివేదికలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం స్కూల్, హస్పిటల్ జోన్లు, బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని మూడు వంతెనల వద్ద, కంకరగుంట ఆర్‌యూబీ వద్ద వర్షం నీరు నిల్వకుండా 20 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేసి పంపించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్‌ను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులపై ఉన్న 52 బ్లాక్ స్పాట్లపై జాయింట్ కమిటీ తనిఖీలో అందించిన సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి సమీపంలోని ట్రామా కేర్ హాస్పిటళ్లలో రహదారి ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించేలా డీఎంహెచ్‌ఓ స్పష్టమైన ఆదేశాలను ఆస్పత్రి నిర్వాహకులకు ఇవ్వాలన్నారు. జాతీయ రహదారి పక్కన వ్యర్థాలు డంపింగ్ చేయకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల అధికారులు వైద్య ఆరోగ్య, ఎక్సైజ్ , నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో 'సమ్యక్ 2025'

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం జాతీయస్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ 'సమ్యక్ 2025' ప్రారంభమైంది. ఈ ఉత్సవానికి రాష్ట్ర క్రీడల అథారిటీ చైర్మన్ అనిమి రవినాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే జాతీయ స్థాయి వేదికను సృష్టించినందుకు కేఎల్‌యూను ప్రశంసించారు. అనంతరం ఆయన్ను వర్సిటీ వీసీ, ప్రో వీసీలు తదితరులు ఘనంగా సత్కరించారు. వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ మొదటి రోజు కార్యక్రమంలో 23 రాష్ట్రాల నుంచి సుమారు 25 వేలం మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఏఐ, ఎంఎల్, మొబిలిటీ, హెల్త్ టెక్, ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 450కుపైగా ఆవిష్కరణలు ప్రదర్శించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, సమ్యక్ చైర్మన్ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ మాధవ్, కన్వీనర్లు డాక్టర్ వి.రాజేష్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, సీనియర్ నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అనిమి రవినాయుడిని సత్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

సామాన్యుడి ధైర్యం.. సమాచార హక్కు చట్టం

- అందరూ సద్వినియోగం చేసుకోవాలి
- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజని

మంగళగిరి టౌన్: సమాచార హక్కు చట్టం సామాన్యుడికి కొండంత ధైర్యమని.. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హైకోర్టు విశ్రాంతన్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజని అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు మాజీ సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి, సమాచార కమిషనర్లు శామ్యూల్, డాక్టర్ చావలి సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం వల్ల దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీతనంగా ఉండేలా చూడడంతోపాటు.. ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తోందని పేర్కొన్నారు. కాగా, కమిషన్ సజావుగా పనిచేయడానికి వీలుగా కార్యదర్శి, సహాయ కార్యదర్శి, న్యాయ కార్యదర్శి, అకౌంట్ ఆఫీసర్ వంటి పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని సమాచార కమిషనర్లు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 900 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి.. ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి వివరించామని తెలిపారు. అనంతరం 'ఆర్‌టీఐ లిట్రసీ క్యాంప్స్ పుస్తకాన్ని' జస్టిస్ రజని ఆవిష్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రజని తదితరులు